సాక్షి కుమురం భీం

శనివారం । 28 । అక్టోబర్ । 2023



మరుగుదొడ్లు లేక తిప్పలు
జిల్లా కేంద్రంలో ప్రజా మరుగుదొడ్లు లేక చిరు వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్లయినా ఒక్క పబ్లిక్ టాయిలెట్ నిర్మించలేదు. 11లో▸



ఆడపడుచుల 'బులాయి'
సిర్పూర్ నియోజకవర్గంలో బతుకమ్మ తర్వాత బులాయి పండుగను అత్యంత వైభవంగా జరుపుకొంటారు. నేడు పండుగ నిర్వహించనున్నారు. 11లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 33.3 /19.1
వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. చలి ప్రభావం కాస్త తగ్గుతుంది.

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో అవ్వల్‌పేన్ పూజలు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని జోడేఘాట్‌లో శుక్రవారం రాత్రి కుమురంభీం వంశస్తులు అవ్వల్‌పేన్ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భీం సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించి మౌనం పాటించారు. సమాధితోపాటు నాలుగు జెండాలకు పూజలు చేశారు. అనంతరం పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. భీం వంశస్తులతోపాటు వివిధ గోత్రాలకు చెందిన ఆదివాసీలు హాజరయ్యారు. ఏటా భీం వర్ధంతి ముందురోజు అవ్వల్‌పేన్‌కు పూజలు చేయడం సంప్రదాయంగా వస్తుందని భీం మనువడు సోనేరావు తెలిపారు.

'కాళేశ్వరం' నిర్మాణంలో భారీ దోపిడీ



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

సిర్పూర్(టి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో సీఎం కేసీఆర్ భారీ దోపిడీకి పాల్పడ్డారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంతోపాటు చీలపెల్లి, పూసిగూడ, మేడిపల్లి, రావన్‌పల్లి, నవేగాం, వెంకట్రావ్‌పేట్, టోంకిని, పారిగాం, జోర్‌పల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజీని నాసిరకంగా నిర్మించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కమీషన్ల కోసం నిబంధనలు తుంగలో తొక్కి, కాంట్రాక్టర్లకు వంత పాడటంతోనే ఈ దుస్థితి నెలకొందన్నారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి అప్పు తెచ్చి ప్రజాధనాన్ని వృథా చేశారని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు సీఎం కేసీఆర్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. కవ్వాల్ అటవీ సంరక్షణ పేరుతో ఆదివాసీ గూడేల్లో కనీసం రోడ్డు మార్గాలను సైతం అభివృద్ధి చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. సిర్పూర్ నియోజకవర్గంలో గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాల్లో ప్రజలు ఆయనకు పూలమాలలు వేసి హారతులతో స్వాగతం పలికారు. యువకులు, మహిళలు బీఎస్పీలో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిడాం గణపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీణ్‌కుమార్, మండల అధ్యక్షుడు బొడ్డు రవి, నాయకులు నగ్రాడె రాజు, రవీందర్, షేక్ చాంద్, అస్లాం, దేవిదాసు, ప్రభాకర్ పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి



ఐక్యత చాటుతున్న వివిధ బీసీ సంఘాల నాయకులు

ఆసిఫాబాద్: రాజకీయ పార్టీలు బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని, లేకుంటే అసెంబ్లీ ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ అన్నారు. త్వరలో నిర్వహించే బీసీల ఆత్మీయ సమ్మేళనానికి అనుబంధంగా కుల సంఘాలతో కలిసి జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ కార్యాలయంలో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. అన్ని కుల సంఘాల నాయకుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా బీసీలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. జిల్లాలోని బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నారని, వారి సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనంలో తీసుకోవాల్సిన నిర్ణయాలను తీర్మానించారు. జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘానికి స్థలం, బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తామని బాండ్ పేపర్‌పై రాసి ఇవ్వాలని, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీలకు మద్దతు తెలిపిన వారికే సహకారం అందిస్తామని, జిల్లా కేంద్రంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన కొండా లక్ష్మణ్ బాపూజీ, పూలే దంపతులు, చాకలి ఐలమ్మ, శివాజీ మహరాజ్, సంత్ జగన్నాథ్ మహరాజ్, సర్దార్ సర్వాయి పాపన్న, వాల్మీకి బోయ, ఇతర బీసీ నాయకుల కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, ఉపాధ్యక్షుడు పురుషోత్తం బాలేశ్, రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కోట వెంకన్న, బీసీ సంఘాల నాయకులు జయరాం, నాగోశ శంకర్, వేములవాడ గణపతి, ఉమేందర్, జిల్లాలోని వివిధ సామాజిక వర్గాలకు బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్, రావిలకు హస్తం

- జిల్లాలో వీడిన ఉత్కంఠ
- ఆసిఫాబాద్, సిర్పూర్ అభ్యర్థుల ప్రకటన
- అసంతృప్తులను బుజ్జగించే యోచనలో అధిష్టానం





అజ్మీరా శ్యామ్‌నాయక్

రావి శ్రీనివాస్

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లాలోని అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచే కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాయి. రెండో జాబితా విడుదలలో గత కొన్ని వారాలుగా ఏర్పడిన ఉత్కంఠకు తెర పడింది. ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి రవాణా శాఖ రిటైర్డ్ అధికారి అజ్మీరా శ్యామ్‌నాయక్, డాక్టర్ గణేశ్ రాథోడ్, మర్సుకోల సర్వసతి కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా.. మూడు నెలల కిందట పార్టీలో చేరిన శ్యాంనాయక్ పేరును అదిష్టానం ఖరారు చేసింది. గెలుపు గుర్రాలను బరిలో దించాలనే యోచనలో ఉన్న కాంగ్రెస్ శ్యామ్‌నాయక్ వైపే మొగ్గు చూపినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సిర్పూర్‌లో సైతం రావి శ్రీనివాస్, కోర్లక కృష్ణారెడ్డి టికెట్ కోసం పోటీ పడగా.. రావి శ్రీనివాస్‌కు అధిష్టానం సీటు కేటాయించింది. టీడీపీలో 2006 తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన రావి శ్రీనివాస్ 2014 అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా టీడీపీ తరఫున ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2018లో కాంగ్రెస్ టికెట్ ఆశించినప్పటికీ టికెట్ రాకపోవడంతో బీఎస్పీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు.

శ్యామ్‌నాయక్ వైపే మొగ్గు..
బరిలో నిలిచే అభ్యర్థులను ప్రకటించి అధికార పార్టీ ముందస్తుగానే సన్నద్ధం కావడంతో జిల్లాలో ఎన్నికల హడావుడి మూడు నెలల కిందటే మొదలైంది. జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను బీఆర్‌ఎస్ పార్టీ ఖరారు చేయడంతో ప్రధాన విపక్ష పార్టీ కాంగ్రెస్ కూడా అసెంబ్లీ బరిలో నిలబడే అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరించింది. చివరకు శుక్రవారం జాబితాను విడుదల చేసింది. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో అధికార పార్టీ అభ్యర్థి కోవ లక్ష్మిని ఢీకొట్టాలంటే శ్యామ్ నాయకే సరైన అభ్యర్థి అని కాంగ్రెస్ అధిష్టానం అభిప్రాయపడినట్లు సమాచారం. ఇంజనీరింగ్ పట్టభద్రుడు.. జిల్లా ప్రజలతో సత్సంబంధాలు ఉన్న వ్యక్తి.. ఇక్కడే జిల్లా రవాణా శాఖాధికారిగా ఏడేళ్లపాటు పనిచేయడంతోపాటు సౌమ్యుడనే పేరున్న శ్యామ్‌నాయక్‌కు సర్వేలు కూడా అనుకూలంగా ఉండడంతో అతడినే అభ్యర్థిగా ఖరారు చేశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

జోరు పెంచిన కాంగ్రెస్..
కాంగ్రెస్ పార్టీ నుంచి ఎవరు బరిలో నిలబడతారు? అన్న ఉత్కంఠకు తెరపడడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం నెలకొంది. అధికార పార్టీని ఢీకొట్టే విధంగా కాంగ్రెస్ వివిధ రూపాల్లో ఇప్పటికే ప్రజల్లో వెళ్లింది. ముఖ్యంగా కాంగ్రెస్ మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఇప్పుడు అభ్యర్థులు ఖరారు కావడంతో నూతనోత్సాహంతో పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని జిల్లా కాంగ్రెస్ కమిటీ పేర్కొంటోంది. అయితే కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తూ టికెట్ ఆశించి భగ్గపడ్డ వారిని కలుపుకుపోవాలని అధిష్టానం అభ్యర్థులకు ఆదేశించినట్లు తెలిసింది. అసంతృప్తులను బుజ్జగించి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సూచినట్లు సమాచారం.

జంగ్ తెలంగాణ

కాంగి'రేస్ షురూ'

- పదింట తొమ్మిది చోట్ల అభ్యర్థులు ఖరారు
- చెన్నూరు స్థానం పొత్తులో సీపీఐకి కేటాయింపు
- అసంతృప్తులు, వర్గ పోరే అభ్యర్థులకు ఇబ్బందులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'హస్తం' పార్టీ అభ్యర్థుల ఎంపిక పూర్తయింది. రెండో జాబితాలో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి మరో ఆరు స్థానాలకు అభ్యర్థుల పేర్లను ఖరారు చేస్తూ ఆ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ వెల్లడించింది. దీంతో ఇప్పటివరకు తొమ్మిది స్థానాల్లో టికెట్లు ఖరారు కాగా, ఒక్క చెన్నూరు సీటుపై ఎలాంటి ప్రకటన రాలేదు. ఆ స్థానాన్ని సీపీఐకే కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా ప్రకటించిన ఆరు స్థానాల్లో బోథ్-వన్నెల అశోక్, ఆదిలాబాద్-కంది శ్రీనివాస్‌రెడ్డి, ముథోల్-బోస్లే నారాయణ్‌రావు పాటిల్, సిర్పూర్-రావి శ్రీనివాస్‌కు ఖరారైంది. దీంతో ఉమ్మడి జిల్లాలో మొదటి జాబితాలో పది స్థానాలకు మంచిర్యాల, నిర్మల్, బెల్లంపల్లి స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, తాజాగా మరో ఆరు స్థానాలు వెల్లడయ్యాయి. మిగిలిన చెన్నూరు సీటును పొత్తులో సీపీఐకి కేటాయిస్తారా? అనేది స్పష్టత రావాల్సి ఉంది.

ఇద్దరు ఎమ్మెల్యేలకు దక్కని చోటు
తమకు టికెట్లు ఇవ్వలేదని అధికార బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, రేఖానాయక్‌కు 'హస్తం' పార్టీ మొండి చేయి చూపింది. ఎలాగైనా ఈసారి పోటీ చేయాలని భావించిన ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశించారు. వీరిలో ఎవరికీ టికెట్ దక్కలేదు. రేఖానాయక్ భర్త శ్యామ్‌నాయక్‌కు మాత్రం ఆసిఫాబాద్ సీటు ఇవ్వడంతో ఇద్దరిలో ఒకరితో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. రేఖానాయక్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాద్ నుంచి ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే అధికారికంగా కండువా కప్పుకోని ఎమ్మెల్యే బాపురావుకు ప్రత్యామ్నాయంగా ఏదైనా అవకాశం కల్పించే అవకాశం ఉంది. ఇక ఆదిలాబాద్‌లో కంది శ్రీనివాస్‌రెడ్డి, ముథోల్‌లో నారాయణ్‌రావు పాటిల్ వైపు ఎంపిక కమిటీ మొగ్గ చూపింది.

రెండు ఆదివాసీ, ఒకటి లంబాడా
ఉమ్మడి జిల్లాలో మూడు ఎస్టీ స్థానాలు ఉండగా, ఈసారి రెండు సీట్లు ఆదివాసీలకే దక్కాయి. లంబాడా వర్గానికి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యేలు పోటీ పడినప్పటికీ వారిని పక్కకు పెట్టి మరీ ఖానాపూర్, బోథ్‌లో ఆదివాసీ నాయకులకే ప్రాధాన్యత ఇచ్చారు. ఇక ఆసిఫాబాద్ సీటు మొదటి నుంచి ఆదివాసీలకు ఇవ్వగా ఈసారి లంబాడా వర్గానికి చెందిన శ్యామ్‌నాయక్‌ను వ్యూహాత్మకంగా బరిలో దింపారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఈ రెండు వర్గాల్లో ఎవరు నెగ్గుతారనేది ఆసక్తి నెలకొంది. టికెట్లు దక్కిన ఇద్దరు ఆదివాసీల్లో పీసీసీ చీఫ్, రేవంత్‌రెడ్డి అనుయాయులుగా ఉన్న వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్సీ పీఎస్సార్ వర్గంగా ఉన్న వన్నెల అశోక్ కావడం గమనార్హం.

ఇక కదనరంగంలోకి...
కాంగ్రెస్‌లో టికెట్ల కేటాయింపులు కొలిక్కి రాక ఆశావహుల్లో రోజులు గడిచే కొద్దీ ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ క్రమంలో అనేక వడపోతలు, సర్వేలు, సమీకరణాలతో చివరకు ఉమ్మడి జిల్లాలో దాదాపు సీట్ల ఖరారు పూర్తయినట్లే. దీంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కదన రంగంలోకి దూకనున్నారు. టికెట్ దక్కని నాయకులు, వర్గ పోరును అభ్యర్థులు ఎలా ఎదుర్కొని గెలుపు తీరాలకు వెళ్తారనేదే పెద్ద సవాల్‌గా మారింది.

కట్టుదిట్టంగా ఎన్నికల కోడ్ అమలు

- ఎస్పీ సురేశ్‌కుమార్



పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో ఎన్నికల కోడ్ కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెబ్బెన పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీ విస్తృతంగా కొనసాగుతోందన్నారు. నగదు, మద్యం రవాణాపై నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే తరహాలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా ఉచిత పంపిణీలపై నిఘా ఉంచామన్నారు. ప్రజలు రూ.50వేల కంటే ఎక్కువ మొత్తంలో నగదు, బంగారం, ఇతర వస్తువులు తీసుకెళ్తే అనుమతి తీసుకోవాలన్నారు. ఆధారాలు లేనిపక్షంలో సీజ్ చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.6.41లక్షల విలువైన 1,122.24 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోగా, రూ.1.67 కోట్ల నగదు సీజ్ చేశామని వెల్లడించారు. అలాగే రూ.3.19లక్షల విలువైన 182 మొబైల్ ఫోన్లు, రూ.7వేల విలువైన 100 టిఫిన్ బాక్సులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పాత రౌడీ షీటర్లు, అనుమానిత వ్యక్తులు, చెడు ప్రవర్తన కలిగిన 1,465 మందిని బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

నేవీ ఉద్యోగానికి ఎంపిక



రాకేష్

పెంచికల్‌పేట్(సిర్పూర్): మండలంలోని ఎల్కపల్లికి చెందిన డబ్బుల రాకేశ్ నేవీ ఫలితాల్లో మెరిశాడు. శుక్రవారం మెరిట్ జాబితా విడుదల కాగా నేవీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. రాకేశ్ తల్లిదండ్రులు శంకరమ్మ, రమేశ్ స్థానికంగా కిరాణం నిర్వహిస్తున్నారు. ఉద్యోగం సాధించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు



సమావేశంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులు

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్
- ఎన్నికల నిర్వహణపై ఉమ్మడి జిల్లా అధికారులకు దిశా నిర్దేశం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల నిర్వహణకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్‌తో కలిసి ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, సీపీ, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, డీసీపీలు, ఏసీపీలతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. అంతకుముందు మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ ఆవరణలో ప్రజలను చైతన్యపర్చేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో కొనసాగుతున్న కళాజాత కార్యక్రమంలో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. జిల్లా ఎన్నికల అధికారి సంతోష్, రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి, జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ పాల్గొన్నారు.

ప్రతీ అంశంపై సూచనలు
కలెక్టర్ సమావేశ మందిరంలో మూడున్నర గంటలపాటు సమావేశం సాగింది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అదనపు డీజీపీ సంజయ్‌కుమార్‌జైన్‌తో కలిసి ఎన్నికల అధికారులు, కలెక్టర్లు బి.సంతోష్(మంచిర్యాల), హేమంత్ బోర్కడే(కుమురంభీం), ఆశిష్ సంగ్వాన్(నిర్మల్), రాహుల్ రాజ్(ఆదిలాబాద్), రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్, ఎస్పీలు ఉదయ్‌కుమార్‌రెడ్డి(ఆదిలాబాద్), సురేష్‌కుమార్ (కుమురంభీం), చల్లా ప్రవీణ్‌కుమార్(నిర్మల్), ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో ఎన్నికల నిర్వహణ, ఈవీఎంల భద్రత, చెక్‌పోస్టుల నిర్వహణ, పోలింగ్ కేంద్రాలు, శాంతిభద్రతలు, మోడల్ కోడ్ తదితర అంశాలపై సమీక్షించారు. పలు అంశాలపై సూచనలు చేశారు.



పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, అదనపు డీజీపీ


ఓటు హక్కుపై విస్తృత ప్రచారం చేయాలి
ఓటు హక్కుపై విస్తృత ప్రచారం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. ఈ నెల 30వరకు 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ఓటరు నమోదు, పోలింగ్ శాతాన్ని పెంచే విధంగా ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేయాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో నిబంధనలు పాటించాలని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వేలైన్స్, వీడియో సర్వేలైన్స్, అకౌంట్ బృందాల అధికారులు పక్షపాతం లేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. కంట్రోల్‌రూం, మీడియా సెంటర్ల నోడల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలకు ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి అనుమతి జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సువిధ యాప్‌ను నిరంతరం పరిశీలించాలని, ఎన్నికల నివేదికలను ప్రతీరోజు సమర్పించాలని ఆదేశించారు. జిల్లాల్లో దివ్యాంగుల ఓటర్లను పోలింగ్ కేంద్రాల వారీగా మ్యాపింగ్ చేసుకోవాలని, కంట్రోల్ రూమ్, 1950, సీ-విజిల్‌లో అందిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని చెప్పారు. జిల్లాల వారీగా ఎన్నికల నిర్వహణపై అమలు జరుగుతున్న కార్యక్రమాలను సమీక్షించారు.

గోండు బెబ్బులి.. భీం

- జోడేఘాట్‌లో నేడు 83వ వర్ధంతి
- ముస్తాబైన పోరాట గడ్డ
- ఉదయం 10 గంటలకు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం శ్రద్ధాంజలి
- 20 వేల మందికి పైగా హాజరయ్యే అవకాశం
- ఆసిఫాబాద్ నుంచి ప్రత్యేక బస్సులు

కెరమెరి(ఆసిఫాబాద్): గిరిజన పోరాట యోధుడు.. ఆదివాసీ ముద్దుబిడ్డ.. గోండు బెబ్బులి కుమురం భీం 83వ వర్ధంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోరాటాల గడ్డ కెరమెరి మండలం జోడేఘాట్ ఇందుకు ముస్తాబైంది. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం శనివారం ఉదయం 8 గంటలకు జెండాలు ఆవిష్కరించనున్నారు. అనంతరం 9గంటలకు సమాధి వద్ద పూజలు చేసి, 10 గంటలకు శ్రద్ధాంజలి ఘటించనున్నారు. ఇప్పటికే కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గిరిజన శాఖ అధికారులు, సిబ్బందికి విధులు
జోడేఘాట్‌లోని జల్, జంగల్, జమీన్ ద్వారాలకు కొత్త రంగులు వేశారు. అలాగే కుమురంభీం స్మృతివనం టైల్స్ తీసేసి రంగులు వేయడంతోపాటు మ్యూజియం, 8 ఫీట్ల భీం విగ్రహానికి మెరుగులు దిద్దారు. శుక్రవారమే జోడేఘాట్‌కు చేరుకున్న ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. టెంట్లు, తాత్కాలిక మూత్రశాలలు ఏర్పాటు చేశారు. గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న ఏటీడబ్ల్యూవోలు ముగ్గురు, సీఆర్‌టీలు, రెగ్యులర్ టీచర్లు వంద మంది, వంట మనుషులు 150 మంది, ఆశ్రమాల వార్డెన్లు ఐదుగురిని డిప్యూటేషన్‌పై నియమించారు. అలాగే జోడేఘాట్ ప్రాంతం అభయారణ్యం కావడంతో భారీ బందోబస్తు చేపడుతున్నారు. దారి పొడవునా బాంబు, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇద్దరు డీఎస్పీలు, ఎనిమిది మంది సీఐలు, 17 మంది ఎస్సైలతో మొత్తం 200 మంది పోలీసులకు విధులు కేటాయించారు. శనివారం ఉదయం 7 గంటల నుంచే భోజనాలు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు. 20 వేల మందికి భోజన వసతి కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆసిఫాబాద్ డిపో నుంచి జోడేఘాట్‌కు ఐదు బస్సులు నడపనున్నారు. వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు.



ప్రత్యేక లైటింగ్‌లో కుమురంభీం విగ్రహం

ప్రత్యేకంగా లైటింగ్
జోడేఘాట్‌కు వచ్చే సందర్శకుల కోసం అధికారులు ప్రత్యేకంగా లైటింగ్ ఏర్పాటు చేశారు. స్మృతి చిహ్నం చుట్టూ రంగురంగుల బల్బులు ఏర్పాటు చేశారు. రాత్రి పూట ఎరుపు, ఆకుపచ్చ, గులాబీ, నీలం, బూడిద రంగుల విద్యుత్ కాంతులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

నేడు విద్యాసంస్థలకు సెలవు
ఆసిఫాబాద్‌రూరల్: కుమురంభీం 83వ వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు బదులుగా నవంబర్ 11న రెండో శనివారం పనిదినంగా పరిగణించాలని పేర్కొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల కోసం స్టేజీ



ప్రజల కోసం టెంట్లు

ప్రసంగాలు లేవు..
రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఈ ఏడాది అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రసంగాలకు అనుమతి లేదు. కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితి కానున్నారు. దర్బార్‌ను కూడా రద్దు చేశారు. కేవలం భీం, సూరు ప్రతిమలకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలకే పెద్దపీట వేశారు.

బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యం

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు ప్రచారం నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శుక్రవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆ పార్టీ మేనిఫెస్టో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా కోవ లక్ష్మి మాట్లాడుతూ పదేళ్లుగా రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి గర్వించదగినదని పేర్కొన్నారు. రైతుబంధు, పేద మహిళలకు ఆర్థికసాయం తదితర పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల నాయకులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ప్రదర్శిస్తున్న నాయకులు

క్లుప్తంగా

ఆర్కేపీ సీహెచ్‌పీ పరిశీలన



సీహెచ్‌పీని పరిశీలిస్తున్న సభ్యులు

రామకృష్ణాపూర్‌: మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ సీహెచ్‌పీని రక్షణ కమిటీ సభ్యులు శుక్రవారం పరిశీలించారు. కమిటీ కన్వీనర్‌ సూర్య నారాయణరాజు మాట్లాడారు. ప్రతీ కార్మికుడు రక్షణ నియమాలు తప్పక పాటించాలని, విధి నిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉంటేనే ప్రమాదాలు నివారించవచ్చని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం ఉత్పత్తి, ఉత్పాదకత కన్నా కార్మికుల రక్షణ, సంక్షేమానికే మొదటి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అనంతరం కార్మికులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సేఫ్టీ కమిటీ సభ్యులు, అధికారులు నరేంద్రకుమార్‌, శ్రీనివాస్‌, ఆంజనేయప్రసాద్‌, నాగరాజు, బాలాజీ భగవతి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత



పట్టుకున్న గుడుంబా, నిందితులతో పోలీసులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఆండాళమ్మకాలనీ వద్ద అక్రమంగా తరలిస్తున్న గుడుంబాను పట్టుకున్నట్లు ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌ నరేందర్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున అండాళమ్మకాలనీ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో మందమర్రి మండలం పులిమడుగుకు చెందిన బొల్లం దినేశ్‌, బొల్లం రాకేశ్‌ ద్విచక్రవాహనాలపై అక్రమంగా 16 లీటర్ల గుడుంబా తరలిస్తూ పట్టుబడ్డారు. గుడుంబాతోపాటు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని ఎక్సైజ్‌ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఎక్సైజ్‌ సబ్‌ఇన్‌స్పెక్టర్‌ జీవన్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్‌ ప్రసాద్‌, కానిస్టేబుళ్లు రాజేంద్రప్రసాద్‌, సరిత, పద్మ పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌ నిర్వాహకుడి అరెస్ట్‌



పట్టుబడ్డ మద్యం బాటిళ్లు, నిందితుడు

బెల్లంపల్లి: బెల్లంపల్లి బూడిదగడ్డ బస్తీకి చెందిన బెల్ట్‌షాప్‌ నిర్వాహకుడిని పోలీసులు అరెస్ట్‌ చేశారు. వన్‌టౌన్‌ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్‌ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం కాంటా చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా బూడిదగడ్డబస్తీకి చెందిన తంగళ్లపల్లి వెంకటేశ్వర్లు వద్ద 20 మద్యం బాటిళ్లు లభించాయి. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నట్లు అతడు అంగీకరించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డా క్షేమం



శిరీషకు పాపను అప్పగిస్తున్న 108 సిబ్బంది

మందమర్రిరూరల్‌: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రికి చెందిన ఎం.శిరీష నిండుగర్భిణి. శుక్రవారం ఆమెకు పురుటినొప్పులు రాగా కుటుంబ సభ్యులు 108 వాహనంలో మంచిర్యాలలోని మాతాశిశుసంరక్షణ కేంద్రానికి తరలిస్తుండగా మంచిర్యాల గంగారోడ్డు వద్ద పురుటినొప్పులు అధికమయ్యాయి. దీంతో 108 సిబ్బంది ఆమెకు పురుడుపోయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను మాతాశిశుసంరక్షణ కేంద్రానికి తరలించారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు.

సలాం.. కుమురంభీం

- జల్‌.. జంగల్‌.. జమీన్‌ నినాదంతో నైజాం సర్కార్‌తో పోరాడిన వీరుడు
- నేటికీ నెరవేరని యోధుడి ఆశయం
- నిర్వీర్యమవుతున్న గిరిజన చట్టాలు
- కాలరాస్తున్న పాలకులు, అధికారులు
- అలుపెరుగని ఆదివాసీల పోరాటం
- నేడు జోడేఘాట్‌లో భీం వర్ధంతి



జోడేఘాట్‌లోని కుమురంభీం విగ్రహం

కెరమెరి(ఆసిఫాబాద్‌): నాడు బ్రిటీష్‌ కబంధహస్తాల నుంచి భారతీయులను విముక్తులను చేసేందుకు స్వాతంత్య్ర పోరాటం చేసి అమరుడయ్యారు జాతిపిత మహాత్మాగాంధీ. జల్‌.. జంగల్‌.. జమీన్‌.. నినాదంతో భూమి, నీరు, అడవి కోసం అప్పటి నైజాం ప్రభుత్వంలోని మిలటరీతో సాయుధ పోరాటం చేసి అసువులు బాసాడు గిరిజన ముద్దబిడ్డ కుమురంభీం.. ఆయన పోరాటం చేసి 83 ఏళ్లు గడుస్తున్నా.. అతడి ఆశయం మాత్రం నెరవేరలేదు. నేటికీ తాగు, సాగునీరు, సరైన రోడ్లు, పాఠశాలలు లేని పల్లెలు కోకొల్లలు. అందుకే.. భీం నువ్‌ మళ్లీ పుట్టాలి.. అంటున్నారు అమాయక ఆదివాసీలు. నేడు జోడేఘాట్‌లో కుమురంభీం 83వ వర్ధంతి నిర్వహిస్తున్న సందర్భంగా ప్రత్యేక కథనం..

పట్టని ఆదివాసీ హక్కులు

నాటి నుంచి నేటి దాకా ఆదివాసీల పరిస్థితి కడు దయనీయం. భూమి, నీరు, అడవిపై ఇంకా వారికి స్వాతంత్య్రం రాలేదు. గిరిజన హక్కులు కల్పించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు మిన్నకుండిపోతున్నారు. గిరిజన చట్టాలు.. గిరిజనేతరుల చుట్టాలవుతున్నాయి. అయినా ప్రభుత్వాలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయి. హక్కులు.. చట్టాల గురించి హితబోధ చేసేవారే వాటిని కాలరాస్తున్నారు. అప్పటి నైజాం సర్కారు ఆదివాసీ భూముల రక్షణకు భూబదలాయింపు చట్టం 1/70 తీసుకువచ్చినా రక్షణ కల్పించే అధికార యంత్రాంగం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో గిరిజనుల భూములను గిరిజనేతరులు గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమించుకుంటున్నారు. భూబదలాయింపు నిషేధం ఉన్న షెడ్యూల్‌ ప్రాంతాల్లో గిరిజనేతరుల వలసలు పెరిగి భూముల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోంది. దీంతో గిరిజనులు మళ్లీ అడవిని నరుక్కుని బతకాల్సిన పరిస్థితులు ఏర్పడుతుండగా.. ఇందుకు అటవీ అధికారులు అడ్డంకిగా మారారు. స్వాతంత్య్రం వచ్చి 76 ఏళ్లు గడిచినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ హక్కులను వారి దరికి చేర్చడంలేదు.

ఎన్నికలప్పుడే వాగ్దానాలు

వివిధ రాజకీయ పార్టీలు ఆదివాసీలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే వాడుకుంటున్నాయి. ఎన్నికలు వచ్చాయంటే మైకు చేత బట్టుకుని వాగ్దానాల వర్షం కురిపిస్తారు. ఆ తర్వాత పత్తా లేకుండా పోతారు. 1/70 చట్టం గురించి ఎరుగని వారుండరు. కానీ.. నేడు ఏజెన్సీలో పుట్టగొడుగుల్లా.. మిద్దెలకు మిద్దెలు నిర్మిస్తుంటే అడ్డుకోవాల్సిన అధికారులు మిన్నకుండిపోతున్నారు.



రెండు కిలోమీటర్ల దూరం నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న ఆదివాసీలు

ఐదో షెడ్యూల్‌కు తూట్లు..

భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్‌ ప్రకారం ఆదివాసీలకు అడవి, భూమి, నీటిపై పూర్తి హక్కు ఉన్నప్పటికీ నూతన చట్టాలు వాటికి తూట్లు పొడుస్తున్నాయి. రాజ్యాంగానికి భంగం కలిగిస్తున్నాయి. 2005 బిల్లు ప్రవేశపెట్టి హక్కులను కల్పిస్తామని గతంలోని ప్రభుత్వాలు చెప్పినా అవి అమలు కాలేదు. ఏజెన్సీ ప్రాంతంలోని నీటి వనరులు పూర్తిగా ఆదివాసీలకే దక్కాలని రాజ్యాంగంలో ఉంది. కుంటలు, చెరువుల నిర్మాణంలో ఆదివాసీలు భూములు కోల్పోగా గిరిజనేతరులకే వాటి ఫలాలు అందుతున్నాయి. ఐటీడీఏ నిధులతో నిర్మించినా కుంటలు, చెరువుల్లో పెంచుతున్న చేపలు, రొయ్యలపై హక్కు ఆదివాసీలకే దక్కాలని చట్టాలు చెబుతున్నా వారి గోడు పట్టించుకునే వారు కరువయ్యారు. కొంతకాలంగా ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి ఎస్టీలుగా చెప్పుకొంటున్నవారు నిజమైన గిరిజనులకు అన్యాయం చేస్తున్నారు. వారి వలసలను నిరోధించే దమ్ము, ధైర్యం అధికారులకు లేకపోయింది. పైగా.. ఎన్నో ఏళ్లుగా ఇక్కడే నివసిస్తున్నట్లు ధ్రువీకరణ పత్రాలు కూడా జారీ చేయడం ఇక్కడి అధికారులకే చెల్లింది.

అమలుకు నోచుకోని జీవోలు

ఆదివాసీల రక్షణకు అప్పట్లో ప్రభుత్వాలు జారీ చేసిన జీవోలు అమలుకు నోచుకోవడంలేదు. గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగాలు వంద శాతం గిరిజనులకే చెందాలని జారీ చేసిన జీవో 3ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. 50 శాతానికంటే ఏజెన్సీ గిరిజనులకు మించకూడదని ఉత్తర్వులో పేర్కొంది. కానీ.. రాష్ట్ర ప్రభుత్వం ఇంకా దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఫలితంగా ఇటీవల ఉద్యోగ, ఉపాధ్యాయుల బదిలీల్లో ఏజెన్సీ, నాన్‌ ఏజెన్సీకి సంబంధం లేకుండా ఏజెన్సీల్లోనూ గిరిజనేతర ఉద్యోగులను భర్తీ చేసింది. దీంతో ఏజెన్సీల్లోని నిరుద్యోగులు అయోమయంలో పడ్డారు. 1/70 చట్టాన్ని కూడా 2/70గా మార్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇలా ఇష్టారీతిన ప్రభుత్వం వ్యవహరిస్తుంటే ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకమైంది. కాగా, 317జీవోను అమలు చేయడంతో గిరిజన ప్రాంతాల్లోని పోస్టుల్లో గిరిజనేతరులు భర్తీ కాగా స్థానిక నిరుద్యోగులు నష్టపోయారు. దీనిపై గిరిజన ఎంపీలు, ఎమ్మెల్యేలు నోరు మెదపడం లేదు.

ఆదివాసీ యోధుడు..

ఆసిఫాబాద్‌: ఆసిఫాబాద్‌ మండలం రౌటసంకెపల్లిలో కుమురం చిన్ను, సోంబాయి దంపతులకు 1901లో కుమురంభీం జన్మించారు. జల్‌, జంగల్‌, జమీన్‌ నినాదంతో నిజాం ప్రభుత్వంపై పోరు సాగించారు. తండ్రి విషజ్వరంతో మృతి చెందడంతో సోదరులు సోము, బొజ్జుతో కలిసి సంకెపల్లి వీడి కెరమెరి మండలం సుర్దాపూర్‌కు చేరారు. అక్కడ ఆదివాసీలు అడవిని నరికి సేద్యం చేయగా పంట చేతికొచ్చే సమయానికి సిద్దిక్‌ అనే జాగిర్దార్‌ భూములు తమవేనని గొడవకు దిగాడు. సిద్దిక్‌పై భీం దాడి చేయడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. భీం అక్కడి నుంచి పారిపోయి బల్లార్షా మీదుగా మహారాష్ట్రలోని చాందా చేరుకున్నారు. అక్కడి నుంచి అస్సాం వెళ్లి కాఫీ తోటల్లో పనిచేస్తూ ఐదేళ్లపాటు అక్కడే ఉండిపోయారు. అనంతరం కెరమెరి మండలం జోడేఘాట్‌కు తిరిగివచ్చారు.

జోడేఘాట్‌ కేంద్రంగా గెరిల్లా పోరాటం

కెరమెరి మండలం జోడేఘాట్‌ కేంద్రంగా కుమురంభీం నిజాం సర్కార్‌తో గెరిల్లా పోరాటం చేశారు. సూరు, వెడ్మ రాము భీంకు సహచరులుగా ఉన్నారు. పంటలు దోచుకునేందుకు వచ్చే వ్యాపారులు, పన్ను వసూళ్లకు వచ్చే రెవెన్యూ అధికారులపై భీం, ఆయన అనుచరులు దాడులు కొనసాగించారు. బాబేఝరి కేంద్రంగా గిరిజనులు అడవిని నరికి 12 పోరు గ్రామాలను ఏర్పాటు చేశారు. దీంతో ప్రభుత్వం వారిపై కేసులు పెట్టింది. కేసుల నుంచి విముక్తి కోసం నిజాం నవాబును కలిసేందుకు భీం హైదరాబాద్‌ వెళ్లినా నిరాశే ఎదురైంది. ఈ క్రమంలోనే 12 గ్రామాలపై దాడులు చేయడంపై కలత చెందిన భీం అటవీశాఖ అధికారులపై తిరగబడ్డారు. యువకులను ఏకం చేసి సాయుధ దళం ఏర్పాటు చేశారు. చివరి ప్రయత్నంగా ప్రభుత్వం సబ్‌ కలెక్టర్‌ను చర్చల కోసం జోడేఘాట్‌కు పంపింది. 12 గ్రామాలకు పట్టాలిస్తామని.. అప్పులన్నీ మాఫీ చేస్తామని ప్రతిపాదించింది. కానీ 12 పోరుగ్రామాల మీద రాజ్యాధికారం కావాలని డిమాండ్‌ చేయడంతో చర్చలు విఫలమయ్యాయి. విషయం నిజాం నవాబుకు తెలియడంతో భీంను అంతమొందించాలని ఆదేశించాడు. 1940లో దాదాపు ఏడు నెలలు భీం అనుచరులు, నిజాం సేనల మధ్య యుద్ధం జరిగింది. దట్టమైన అడవిలో భీం ఆచూకీ దొరకలేదు. మడావి కొద్దు ఇచ్చిన సమాచారంతో అక్టోబర్‌ 10వ తేదీన భీకర పోరులో భీం నేలకొరిగారు. నాలుగు దశాబ్దాలుగా ఏటా జోడేఘాట్‌లో భీం వర్ధంతి నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఎన్నికల కోడ్‌ అమలులో ఉండడంతో దర్బార్‌ను రద్దు చేశారు.



ఆదివాసీల పూరిళ్లు

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గోదావరి రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన వినయ్‌, మల్లేశ్‌ బైక్‌పై వెళ్తున్నారు. ఎదురుగా మరో బైక్‌పై వస్తున్న నవనీత్‌, నౌజర్‌ వస్తున్నారు. వీరి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. వీరిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు తరలించారు.

బైక్‌ అదుపుతప్పి యువకుడికి గాయాలు

బెల్లంపల్లిరూరల్‌: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. తాళ్లగురిజాల ఎస్సై నరేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్‌ మండలం తంగళ్లపల్లి గ్రామానికి చెందిన మారెల్లి పవన్‌ సింగరేణిలో కాంట్రాక్ట్‌ కార్మికుడు. శుక్రవారం సాయంత్రం బెల్లంపల్లికి ఓ పని నిమిత్తం వచ్చి తిరిగి ఇంటికి తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. కన్నాల శివారులోని పెట్రోల్‌ బంక్‌ సమీపంలో బైక్‌ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో పవన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పవన్‌ను చికిత్స కోసం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. బైక్‌ అదుపుతప్పిందా.. లేదా ఏదైనా వాహనం ఢీకొట్టిందా.. అనే కోణంలో విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వాలీబాల్‌లో బీపీఏ, మందమర్రికి రెండోస్థానం



రెండో స్థానంలో నిలిచిన బీపీఏ, మందమర్రి జట్టు క్రీడాకారులు

రెబ్బెన(ఆసిఫాబాద్‌): ఆర్జీ–3లోని రాణీరుద్రమదేవి స్టేడియంలో డబ్ల్యూపీఎస్‌ అండ్‌ జీఏ వార్షిక క్రీడల్లో భాగంగా నిర్వహించిన కంపెనీ లెవల్‌ వాలీబాల్‌ పోటీల్లో బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల జట్టు క్రీడాకారులు అద్భుత ఆటతీరును ప్రదర్శించి రెండోస్థానంలో నిలిచారు. శుక్రవారం నిర్వహించిన ఫైనల్‌ పోటీల్లో ఆర్జీ–1, ఆర్జీ–2 జట్టుతో పోరాడిన బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల జట్టు క్రీడాకారులు తమదైన ఆటతీరుతో ఆకట్టుకున్నారు. అయితే హోరాహోరీగా జరిగిన పోటీల్లో ఆర్జీ–1, ఆర్జీ–2 జట్టు మొదటి స్థానంలో నిలిచింది. బెల్లంపల్లి, మంద్రమర్రి జట్టు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. ఈ సందర్భంగా కంపెనీ లెవల్‌లో వాలీబాల్‌ పోటీల్లో రెండో స్థానంలో నిలిచిన క్రీడాకారులను బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల సింగరేణి ఉన్నతాధికారులు, సీనియర్‌ క్రీడాకారులు అభినందించారు.

కాంగ్రెస్‌ అభ్యర్థుల బయోడేటా..

ఆదిలాబాద్‌ నియోజకవర్గం

అభ్యర్థి పేరు : కంది శ్రీనివాసరెడ్డి
తల్లిదండ్రులు : అనసూయ–కిష్టారెడ్డి
పుట్టిన తేదీ : 05–08–1983
గ్రామం : హస్నాపూర్‌, మండలం తాంసి, జిల్లా ఆదిలాబాద్‌
భార్య : కంది సాయిమౌనారెడ్డి
పిల్లలు : కూతురు అరికరెడ్డి, కొడుకు ఇషాన్‌రెడ్డి
విద్యార్హత : ప్రాథమిక విద్యాభ్యాసం 1 నుంచి 5వ తరగతి వరకు స్వగ్రామమైన హస్నాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్‌ వరకు కాగజ్‌నగర్‌ జవహర్‌ నవోదయ విద్యాలయంలో పూర్తి చేశారు. హైదరాబాద్‌ జేఎన్‌టీయూలో బీటెక్‌ ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్స్‌ ఇంజినీరింగ్‌ చదివారు. అమెరికాలోని మిస్సోరి యూనివర్సిటీ ఆఫ్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ నుంచి ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీలో మాస్టర్‌ ఆఫ్‌ సైన్స్‌ చేశారు.

ఉద్యోగం: అమెరికాలోని కాలిఫోర్నియాలో స్టేట్‌ గవర్నమెంట్‌లో సిటీ ఆఫ్‌ శాన్‌ డియాగో సంస్థ, నాన్‌ ప్రాఫిట్‌ వైద్య ఆరోగ్య హెల్త్‌ కేర్‌ సంస్థ అయిన కొలరాడో యాక్సిస్‌లో పనిచేశారు. అలాగే లెనోవా పర్సనల్‌ కంప్యూటర్స్‌ ఉత్పత్తి సంస్థ, సెమీ కండక్టర్ల ఉత్పత్తి సంస్థ ఎల్‌ఎస్‌ఐ కార్పొరేషన్‌లో కూడా పనిచేశారు. రాష్ట్రంలో ఆర్టిఫింట్‌ టెక్నాలజీస్‌ గ్రూప్‌ ఆఫ్‌ కంపెనీస్‌ను స్థాపించారు. అమ్మ న్యూస్‌ చానెల్‌ అధినేత, చైర్మన్‌గా ఉన్నారు.

రాజకీయ ప్రవేశం: 2022 ఆగస్టు 21వ తేదీన పార్టీ రాష్ట్ర వ్యవహరాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్‌ సమక్షంలో బీజేపీలో చేరారు. 2023లో బీజేపీని వీడి మే 8వ తేదీన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఐసీసీ నాయకురాలు ప్రియాంక గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

ఖానాపూర్‌ నియోజకవర్గం

అభ్యర్థి పేరు : వెడ్మ బొజ్జుపటేల్‌
వయస్సు : 37
కులం : ఎస్టీ(గోండు)
విద్యార్హత : ఎంఏ, బీఈడీ, ఎల్‌ఎల్‌బీ
స్వస్థలం : కల్లూరుగూడ, ఘన్‌పూర్‌ పంచాయతీ, మం.ఉట్నూరు
తల్లిదండ్రులు : వెడ్మ గిరిజాబాయి, భీంరావు
భార్య : వెడ్మ ద్రుపద(టీచర్‌)
కుమారులు : తనీశ్‌పటేల్‌ రాజ్‌గోండ్‌, నితీశ్‌పటేల్‌ రాజ్‌గోండ్‌

సామాజిక బాధ్యతలు :
- 2012–16 ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు
- 2016నుంచి ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
- ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) సలహాదారు
- 2016–18 గిరిజన యూనివర్సిటీ సాధన ఫోరం కన్వీనర్‌
- 2018–19 యంగ్‌ జనరేషన్‌ యూత్‌ ఫోరం ఆదిలాబాద్‌ జిల్లా ఉపాధ్యక్షుడు
- 2018–21 పీసా జిల్లా కో ఆర్డినేటర్‌

రాజకీయ అనుభవం :
- 2021, ఆగస్టు 4న పీసీసీ చీఫ్‌ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక
- పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకం
- ఆదిలాబాద్‌ డీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌
- ఖానాపూర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి

ముథోల్‌ నియోజకవర్గం

అభ్యర్థి పేరు : భోస్లే నారాయణరావు పటేల్‌
వయస్సు : 65ఏళ్లు
విద్యార్హత : ఇంటర్మీడియట్‌
స్వస్థలం : భైంసా (బడ్‌గాం)
కులం : ఆరె మరాఠా (బీసీ–బీ)
తల్లిదండ్రులు : కమలాబాయి, గోపాల్‌రావుపటేల్‌
భార్య : లక్ష్మీబాయి
కుమారుడు : అఖిలేశ్‌పటేల్‌
కుమార్తె : అర్చన

పార్టీలు : టీడీపీ, టీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌, ఎన్సీపీ

రాజకీయ అనుభవం..
- 1994లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపు.
- 1999 రెండోసారి టీడీపీ నుంచి బరిలో నిలిచి స్వల్ప తేడాతో ఓటమి
- 2004లో టీఆర్‌ఎస్‌లో చేరి ఎన్నికల్లో పోటీచేసి రెండోసారి ఎమ్మెల్యేగా విజయం
- 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌ ఆదేశాల మేరకు పోటీ నుంచి దూరం
- 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌ సీటు దక్కకపోవడంతో ఎన్సీపీలో చేరి పోటీచేసి ఓటమి

సిర్పూర్‌ నియోజకవర్గం

అభ్యర్థి పేరు : రావి శ్రీనివాస్‌
పుట్టిన తేదీ : 05– 04– 1975
తల్లిదండ్రులు : మోహన్‌రావు, ఝాన్సీలక్ష్మి
భార్య : రావి సునీత
కుమారుడు : శ్రీసాయి ఓంకార్‌
సామాజిక వర్గం : కమ్మ
స్వస్థలం : గుంటూరు కాలనీ, కాగజ్‌నగర్‌
విద్యాభ్యాసం : బీఏ

ఆసిఫాబాద్‌ నియోజకవర్గం

అభ్యర్థి పేరు : అజ్మీరా శ్యాంనాయక్‌
పుట్టిన తేదీ : 10 –10– 1970
భార్య : రేఖానాయక్‌ (ఖానాపూర్‌ ఎమ్మెల్యే)
కుమార్తె : పూజానాయక్‌
కుమారుడు : అక్షిత్‌
సామాజిక వర్గం : ఎస్టీ (లంబాడా)
విద్యాభ్యాసం : బీఈ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, బ్యాచిలర్‌ ఆఫ్‌ జర్నలిజం (ఉస్మానియా విశ్వవిద్యాలయం), ఎల్‌ఎల్‌బీ (శాతవాహన విశ్వవిద్యాలయం)
ఉద్యోగం: ఎంపీఏ (ఆదిలాబాద్‌/ఆసిఫాబాద్‌), డీటీవో(ఆసిఫాబాద్‌/జగిత్యాల)

బోథ్‌ నియోజకవర్గం

అభ్యర్థి పేరు : వన్నెల అశోక్‌
తల్లిదండ్రులు : శకుంతల– కిష్టన్న
భార్య : సునీత (వైద్యురాలు)
పిల్లలు : కూతురు అర్యాయి, కుమారుడు అశ్విక్‌
గ్రామం : తాంసి, జిల్లా, ఆదిలాబాద్‌
విద్యార్హత : ఎంబీబీఎస్‌, ఎంఎస్‌ (మంచిర్యాలలో ఆర్థోపెడిక్‌ ప్రైవేట్‌ వైద్యుడిగా పనిచేస్తున్నాడు.)
పుట్టిన తేదీ : 01– 06– 1985

రాజకీయ ప్రవేశం:
2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీలో చేరి అప్పటి ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి గెలుపునకు కృషి చేశారు.
ప్రస్తుతం టీపీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. తాంసిలో ఆయన తాత వన్నెల ఎల్లన్న తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన యువకుడు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కన్నాలబస్తీ పోచమ్మ ఆలయం వద్ద ఓ యువకుడి నుంచి పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్‌ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్‌ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామానికి చెందిన సింగతి సురేందర్‌ గంజాయి సేవిస్తూ పోలీసులకు కనిపించాడు. పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. అతడి వద్ద 150 గ్రాముల గంజాయి లభించింది. గంజాయికి అలవాటుపడిన సురేందర్‌ బల్లార్షా నుంచి తెచ్చి ఇక్కడ అధిక ధరకు యువకులకు అమ్ముతున్నాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మందమర్రిరూరల్‌: మందమర్రి పోలీస్‌స్టేషన్‌ పరిధి పాతబస్టాండ్‌ సమీపంలోగల రాజీవ్‌నగర్‌లోని ఖాళీ స్థలంలో గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మందమర్రి ఎస్సై చంద్రకుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సై తన సిబ్బందితో పెట్రోలింగ్‌ నిర్వహిస్తుండగా రాజీవ్‌నగర్‌ ఏరియాలో ఇద్దరు యువకులు గంజాయి సేవిస్తూ కనబడ్డారు. అదుపులోకి తీసుకోగా వారి వద్ద 100 గ్రాముల గంజాయి లభించింది. మహారాష్ట్ర నుంచి తక్కువ ధరకు తెచ్చి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఈ మేరకు వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే స్థానిక మూడో జోన్‌లోని దీప అనే మహిళ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 18 మద్యం క్వార్టర్‌ బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తనిఖీల్లో పట్టుబడిన నగదు సీజ్‌



నగదు సీజ్‌ చేస్తున్న పోలీసులు



ఎఫ్‌ఎస్‌టీ అధికారికి నగదు ఇస్తున్న ఎస్సై

రామకృష్ణాపూర్‌: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆధారాలు లేకుండా ద్విచక్రవాహనంలో రషీద్‌ అనే వ్యక్తి రూ.3లక్షలు తరలిస్తుండగా సీజ్‌ చేసి ఎఫ్‌ఎస్‌టీ టీమ్‌కు అప్పగించినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు.

బెల్లంపల్లిలో రూ.2లక్షలు..

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో సరైన ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న నగదును పోలీసులు సీజ్‌ చేశారు. వన్‌టౌన్‌ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కాంటా చౌరస్తావద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా స్టేషన్‌రోడ్‌ కాలనీకి చెందిన ఎండీ రాజ్‌మహ్మద్‌ వద్ద రూ.2లక్షలు పట్టుబడ్డాయి. వీటికి సరైన ఆధారాలు చూపించకపోవడంతో ఈ మొత్తాన్ని సీజ్‌ చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. సీజ్‌ చేసిన డబ్బును బెల్లంపల్లి ఎన్నికల ఎఫ్‌ఎస్‌టీ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెల్లంపల్లి మండలం లంబాడా తండాలో..

బెల్లంపల్లిరూరల్‌: బెల్లంపల్లి మండలం లంబాడా తండాలో తాళ్లగురిజాల పోలీసులు రూ.3 లక్షల నగదు పట్టుకున్నారు. ఎస్సై నరేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం పోలీసులు లంబాడా తండా గ్రామంలోని పెట్రోల్‌ బంక్‌ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో దహెగాం మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన దరావత్‌ దేవాజీ వద్ద రూ.3లక్షల నగదు పట్టుకున్నారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పట్టుకున్న నగదును ఎఫ్‌ఎస్‌టీ టీమ్‌ అధికారి సురేఖకు అందజేశారు. ఏఎస్సై లింగన్న, సిబ్బంది రాజం ఉన్నారు.

చెక్‌పోస్ట్‌ పరిశీలన

బెల్లంపల్లి మండలం పోశమ్మగడ్డ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను బెల్లంపల్లిరూరల్‌ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్‌ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే చిన్నయ్య వాహనం తనిఖీ చేశారు.

జగన్మాత.. నమోస్తుతే..

- ఆండాళమ్మ అమ్మవారికి ఒడిబియ్యం
- పట్టువస్త్రాలు సమర్పించిన పద్మశాలీ కులస్తులు



ఆండాళమ్మకు ఒడిబియ్యం తీసుకొస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు



ఒడిబియ్యం సమర్పిస్తున్న భక్తులు



ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జగన్మాత ఆండాళమ్మను సుహాసినులు భక్తిప్రపత్తులలో కొలిచారు. ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. తమ ఇంటి ఆడపడుచుగా భావించే పద్మావతి అమ్మవారు, శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి వార్లకు సిరిసిల్ల పద్మశాలీ సమాజం పట్టువస్త్రాలు సమర్పించారు. మార్కండేయ ఆలయం నుంచి ఊరేగింపుగా వచ్చి ఆండాళమ్మకు ఒడిబియ్యం సమర్పించారు. అంతకుముందు శ్రీవారు మాఢవీధుల్లో ఏనుగు వాహనంపై విహరించారు. గోవింద నామస్మరణలతో ఆలయ వీధులు మార్మోగాయి. ఆలయ మాజీ చైర్మన్లు ఉప్పుల విఠల్‌రెడ్డి, చేపూరి నాగరాజు, తీగల శేఖర్‌గౌడ్, ఈవో మారుతిరావు, ఏఈవోలు రవీందర్, ప్రభాకర్, అర్చక స్వాములు కృష్ణమాచారి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, యూత్ విభాగం అధ్యక్షుడు గుండ్లపెల్లి పూర్ణచందర్, మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, కౌన్సిలర్లు గుడ్ల శ్రీనివాస్, పత్తిపాక పద్మ, ప్రముఖులు జిందం చక్రపాణి, గుజ్జె తార, బొల్లి రామ్మోహన్, ఆడెపు రవీందర్, రాజేందర్ పాల్గొన్నారు.

పొన్నరథంపై గోవిందుడు

శుక్రవారం రాత్రి ప్రధాన ఘట్టం పొన్నరథోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నమయ్య కీర్తనలను కళాకారులు ఆలపించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన, భజన సంకీర్తనలు చేశారు. మహిళలు మంగళహారతులతో మొక్కులు చెల్లించుకున్నారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ
- భర్త మరణంతో ఒంటరిగా మారిన షాహిదా
- వైద్యమందక తిప్పలు పడుతున్న వైనం



మంచానికి పరిమితమైన షాహిదా బేగం

ఎల్లారెడ్డిపేట: దురదృష్టం ఆ కుటుంబాన్ని వెంటాడింది. కట్టుకున్న భర్త మానసిక స్థితి బాగా లేక కిరోసిన్ పోసుకొని మరణించగా.. ఒంటరి జీవితం అనుభవిస్తున్న ఆ వివాహితకు మరోసారి విధి పరీక్ష పెట్టింది. రోడ్డు ప్రమాదంలో గాయపడగా.. 12 పక్కటెముకలు విరిగాయి. వైద్యం చేయించుకోవడానికి చేతిలో చిల్లిగవ్వ లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. ఎవరైనా దాతలు కరుణిస్తేనే వైద్యమందే పరిస్థితులున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన షేక్ షాహిదా బేగం(45)కు కామారెడ్డి జిల్లాకు చెందిన షాదుల్‌తో 18ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు షేక్ ఆసిఫ్ జన్మించాడు. అనంతరం షాదుల్ మానసిక పరిస్థితి సరిగా లేక ఐదేళ్ల క్రితం నిప్పంటించుకొని మృతిచెందాడు. అప్పటి నుంచి కుమారుడితో కలిసి రాచర్లగొల్లపల్లిలో కిరాయి ఇంట్లో ఉండి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 14న రాత్రి గొల్లపల్లి బస్టాండ్‌లో రోడ్డు దాటుతుండగా.. బైక్ అతివేగంగా వచ్చి షాహిదాను ఢీకొట్టింది. గాయపడ్డ షాహిదాను ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు సీటీ స్కానింగ్ చేసి 12 పక్కటెముకలు విరిగినట్లు చెప్పారు. ఇప్పటి వరకు రూ.లక్ష వరకు ఖర్చు చేయగా.. పూర్తిగా కోలుకోవడానికి మరో రూ.2.50లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. భర్త మరణం, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు, ఆరేళ్ల కుమారుడితో ఉన్న ఆమె ప్రస్తుతం వైద్యం చేయించుకునే పరిస్థితుల్లో లేదు. దాతలు కరుణించి సాయం అందిస్తే తప్ప మరో అవకాశం లేదని, దాతలు ఆదుకోవాలని ఆమె వేడుకుంటోంది.

సాయం చేయాల్సిన ఫోన్‌పే నంబర్
99489 85093

బీఆర్‌ఎస్ అవినీతి పాలనను పాతరేద్దాం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

పెద్దపల్లిరూరల్: బీఆర్‌ఎస్ అవినీతి పాలనను పాతరేసేందుకు అందరూ సన్నద్ధం కావాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ కోరారు. పెద్దపల్లి మున్సిపల్ ఎనిమిదో వార్డు కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి, ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంకూరి సురేందర్‌సన్నీ, సుల్తానాబాద్ మాజీ ఎంపీపీ ఐల రమేశ్ శుక్రవారం బీఎస్పీలో చేరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉషతో కలిసి ఆయన వారికి బీఎస్పీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. బహుజనులు ఏకమై వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో అవినీతి బీఆర్‌ఎస్ సర్కార్‌ను అంతం చేయాలని ప్రవీణ్‌కుమార్ కోరారు. కౌన్సిలర్‌గా ఉన్న తనవార్డులో అభివృద్ధి పనులకు సహకరించకుండా ఇబ్బందులకు గురిచేశారని కౌన్సిలర్ భాగ్యలక్ష్మి ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఏకంచేసి బీఎస్పీని గెలిపించుకుందామని ఆమె అన్నారు.

ఎన్టీపీసీలో వేడుకలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం సంస్థలోని 200 మెగావాట్ల మొదటి యూనిట్ ఉత్పత్తి దశలోకి వచ్చి 40 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా శుక్రవారం వేడుకలను జరుపుకున్నారు. ప్లాంట్‌లోని టర్బయిన్ జనరేటర్‌హాల్‌లో అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు మాట్లాడారు. పనిస్థలాల్లో రక్షణ చర్యలు పాటించి మెరుగైన విద్యుత్ ఉత్పత్తి సాధించాలని వారు సూచించారు.

ప్రజాగర్జన బహిరంగసభకు తరలిరండి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న గజ్జెల కాంతం

కరీంనగర్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యతను కోరుతూ నవంబర్ 4న కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాగర్జన బహిరంగ సభకు బహుజనులంతా తరలిరావాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో వివిధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి అనంతరం అంబేడ్కర్ స్టేడియంను సందర్శించి సభ ఏర్పాట్లపై మాట్లాడారు. దశాబ్దాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా దగా చేస్తున్న పాలక పార్టీల తీరుపై బహుజనులంతా మేల్కొవాల్సిన అవసరం ఉందని అన్నారు. జనాభాలో సగభాగమైన బీసీలను ప్రభుత్వాలు ఓట్లు వేసే యంత్రాలుగా వాడుకుంటున్నాయే తప్ప రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించడం లేదని ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో పరిపాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అమలు చేయకుండా మనువాద ఎజెండాను అమలు చేస్తూ రిజర్వేషన్లను దశలవారీగా ఎత్తివేసే కుట్రలను ఎదుర్కొనేందుకు బహుజనులంతా ఏకం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా, కుల సంఘాల నాయకులు సముద్రాల అజయ్, జీఎస్ ఆనంద్, కలర్ సత్తెన్న, గోష్కి శంకర్, మీసాల సాయిలు, అయిల్ల ప్రసన్న, సంజీవ్‌నాయక్, రవీందర్‌నాయక్, క్యాదాసి ప్రభాకర్, పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మిక కుటుంబాల ఓటుతో బుద్ధిచెబుతాం

- గల్ఫ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గిళ్ల రవిగౌడ్



ఖతర్‌లో నిర్వహించిన గల్ఫ్ కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో రవిగౌడ్ తదితరులు

మల్లాపూర్(కోరుట్ల): గల్ఫ్ వెళ్లిన కార్మికుల కుటుంబాల ఓట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన విధంగా బుద్ధి చెబుతామని గల్ఫ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గిళ్ల రవిగౌడ్ హెచ్చరించారు. ఖతర్ దేశంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన గల్ఫ్ కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దాదాపు 15 లక్షల మంది గల్ఫ్ కార్మికుల వెతలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. పరాయిదేశంలో కార్మికులు అనారోగ్య సమస్యలు, పని ఒత్తిడి, రోడ్డు ప్రమాదాలు, వేతన బాధలతో ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం అందించడంతోపాటు సంక్షేమ పథకాలల్లో ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో పోటీకి గల్ఫ్ కార్మికులు, వారి కుటుంబసభ్యులు సిద్ధంగా ఉన్నారని, వారితో సీఎం కేసీఆర్ పోటీ చేయనున్న కామారెడ్డిలో భారీ సంఖ్యలో నామినేషన్లు వేయించాలని నిర్ణయించామని ఆయన వెల్లడించారు. దీంతోపాటు సిరిసిల్ల, వేములవాడ, కోరుట్ల, జగిత్యాల, బాల్కొండ, నిర్మల్ వంటి గల్ఫ్ ప్రభావిత నియోజకవర్గాల్లో కూడా పోటీచేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. గల్ఫ్‌దేశాల్లోని కార్మికులందరూ గల్ఫ్ కార్మిక నాయకులకు ఓట్లు వేయించాలని కోరారు. తెలంగాణ ప్రజాసమితి అధ్యక్షుడు చెన్నమనేని తిరుపతియాదవ్, తెలంగాణ గల్ఫ్ అధ్యక్షుడు మధు, తెలంగాణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజా నిజామొద్దీన్, ఖతర్ జాగృతి అధ్యక్షురాలు నందిని, బీఆర్‌ఎస్ ఖతర్ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, దోహా తెలుగు సమితి అధ్యక్షుడు పంచతి ధర్మరాజ్‌యాదవ్, సుందరగిరి శంకర్‌గౌడ్, తాల్లపెల్లి ఎల్లయ్య, గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రీతికి చోటు



తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో ప్రీతి

కరీంనగర్ సిటీ: తన చుట్టూ నిత్యం చూస్తున్న ప్రకృతి, జీవరాశులనే తన కలంతో రాస్తూ అద్భుతమైన కవితలు రాస్తున్న కరీంనగర్‌కు చెందిన ప్రీతి తాజాగా తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు అయింది. ఈమేరకు ఈనెల 26న అవార్డు అందుకున్నారు. గతంలో దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ నోబెల్ అవార్డుకు ఎంపికైంది. చిన్నప్పటి నుంచి తాను చూస్తున్న ప్రకృతి, జీవరాశులు, ప్రజలు, జీవన విధానాలను నిశితంగా పరిశీలించి పాఠశాలస్థాయి నుంచే కవితలు రాయడం మొదలు పెట్టింది. ఇండియాతో పాటు మలేషియా, సింగపూర్, బంగ్లాదేశ్ కాపీరైట్స్ సంపాదించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బుక్‌తో పాటు విత్తనాలు పంపి మొక్కలు పెంచేలా ప్రోత్సహించినందుకు తాజాగా తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రీతి పేరు నమోదు చేసుకుంది.

డెంగీ జ్వరంతో ఆర్‌ఎంపీ మృతి



ఆస్పత్రి వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మృతుడి బంధువులు

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ
- మృతదేహంతో బంధువుల ఆందోళన



దానపల్లి రాజమౌళి(ఫైల్)

పాతమంచిర్యాల: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రైవేటు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో కుమురంభీం జిల్లా తిర్యాణి మండలం గంభిరావుపేటకు చెందిన ఆర్‌ఎంపీ దానపల్లి రాజమౌళి(38) డెంగీ జ్వరానికి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. వైద్యులు సరైన వైద్యం అందించకపోవడం వల్లే మృతిచెందాడని బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజమౌళికి నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో మంచిర్యాలలోని ప్రైవేటు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు పరీక్షలు చేసి డెంగీ జ్వరంగా నిర్ధారించారు. ప్లేట్‌లెట్‌లు 87వేలు ఉన్నాయని నాలుగు రోజులు చికిత్స అందించారని, గురువారం అర్ధరాత్రి ప్లేట్‌లెట్లు 11వేలకు తగ్గాయని, కరీంనగర్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించినట్లు బంధువులు తెలిపారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని అన్నారు. రోగి ఆరోగ్య పరిస్థితిని తెలుపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆస్పత్రి వైద్యులు కారణమని మృతుడి భార్య సుజాత ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆస్పత్రి ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. పట్టణ సీఐ రాజు ఆస్పత్రికి చేరుకుని యాజమాన్యంతో మాట్లాడారు. యాజమాన్యం హామీ మేరకు బాధితులు ఆందోళన విరమించారు. కాగా, రాజమౌళికి ఇద్దరు పిల్లలు సాయిమహేష్, రోహిత ఉన్నారు.

మన ఓటర్లు ఎందరు..?

- లెక్కలు తీస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ!

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అధికార బీఆర్‌ఎస్ పార్టీ తమ ఓటు బ్యాంకు ఎంత అనే లెక్కలు వేసుకుంటోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారులతోపాటు స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలతో మేలు జరిగిన వారు, సర్కారు పథకాలు అందుకున్న వారి వివరాలు సేకరిస్తోంది. పోలింగ్ బూత్‌ల వారీగా ఎంతమంది తమ ఓటర్లు ఉన్నారు? ఎంతమంది ప్రతిపక్షాలకు చెందిన వారు ఉన్నారనే వివరాలను వివిధ మార్గాల్లో సేకరిస్తున్నట్లు సమాచారం. తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఈ మేరకు ఓటరు ఫోను నంబరు, ఆధార్ కార్డు వివరాలు తీసుకుని నమోదు చేస్తున్నారు. నియోజకవర్గాల్లో తమ అనుకునే ఓటర్లు ఎందరు? కాని వారు ఎందరు? వచ్చే ఎన్నికల్లో ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఎన్ని ఓట్లు పడే అవకాశం ఉంది? అనే కోణంలో బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకు ఎంత ఉందనే వివరాలు సేకరిస్తున్నారు. అంతేకాక ప్రతిపక్ష పార్టీ వైపు ఎంతమంది ఓటర్లు ఉన్నారనేది కూడా ఓ అంచనా వస్తే, ఎక్కడ పార్టీ బలంగా ఉందో, ఎక్కడ బలహీనంగా ఉందో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

రేషన్ డీలర్ల నుంచి..

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఎవరు ఎటువైపు ఉన్నారనే సమాచారాన్ని రేషన్ డీలర్ల నుంచి సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. చెన్నూరు నియోజకవర్గంలో రేషన్ డీలర్ల నుంచి ఓటర్ల సమాచారం ఇవ్వాలని నాయకులు కోరుతున్నట్లు అక్కడి మండలాల్లోని డీలర్లే చెబుతున్నారు. స్థానిక నాయకులు ఒక్కో చౌక ధర దుకాణం పరిధిలో ఉన్న రేషన్‌కార్డు ఉన్న వారి ఓటరు జాబితా ప్రకారం పేర్లు, ఫోన్ నంబర్లు తీసుకుంటున్నారు. కొందరు డీలర్లు తాము అలా వ్యక్తిగత వివరాలు రాజకీయ పార్టీల ప్రయోజనాల కోసం తీసుకోబోమని చెబుతున్నట్లు తెలిసింది. జిల్లా అధికారులకు చెప్పి చేయిస్తామని కొందరు నాయకులు బెదిరిస్తున్నారని చెబుతున్నారు. దీనిపై జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో సంప్రదించగా తమ ఆఫీసు నుంచి అలాంటి సమాచార సేకరణ చేయమని చెప్పలేదని చెబుతున్నారు.

రక్షణలో భాగస్వాములు కావాలి



షీల్డ్ అందుకుంటున్న అధికారులు, నాయకులు

కాసిపేట: సింగరేణి ఉద్యోగులు రక్షణలో భాగస్వాములు కావాలని సేఫ్టీ కమిటీ కన్వీనర్ జీ నాగేశ్వరరావు, అధికారి జయంత్‌కుమార్ సూచించారు. 54వ రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిని సేఫ్టీ కమిటీ బృందం తనిఖీ చేసింది. ఈ సంవత్సరం సంస్థలో రికార్డు స్థాయిలో అతి తక్కువ ప్రమాదాలు నమోదయ్యాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఇందుకు కృషి చేసిన కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్యను అభినందించారు. రక్షణ కోసం ఉద్యోగులు ఆధునిక సాంకేతికతతో చేసిన పరికరాలు, పనిముట్లు వాడాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. కమ్యూనికేషన్ సెల్ మందమర్రి ఏరియా వారు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరిస్తూ ఉద్యోగులకు అర్థమయ్యే రీతిలో నాటకాన్ని ప్రదర్శించారు. గనిలో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రదర్శన ఇచ్చారు. రెస్క్యూ బృందం సభ్యులు ప్రమాదం జరిగిన తరువాత తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 53వ వార్షిక రక్షణ వారోత్సవాల్లో గెలుపొందినవారికి అధికారులు, యూనియన్ నాయకులు బహుమతి అందించారు. అంతకుముందు సేఫ్టీ బృందానికి ర్యాలీగా స్వాగతం పలికి డప్పుచప్పుళ్లతో వేదిక వద్దకు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏరియా ఇన్‌చార్జి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏరియా రక్షణాధికారి రవీందర్, గని మేనేజర్ అల్లావుద్దీన్, రక్షణాధికారి సునీల్, సంక్షేమాధికారి జీశాన్, రక్షణ కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్కే 7 గనిపై..

శ్రీరాంపూర్: ఆర్కే 7 గనిపై శుక్రవారం 54వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తా ఆధ్వర్యంలో రక్షణ తనిఖీ బృందం సభ్యులు గనిని సందర్శించి రక్షణ ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డి మాట్లాడారు. ప్రతీ ఉద్యోగి విధి నిర్వహణలో రక్షణ సూత్రాలు పాటించాలని సూచించారు. ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో అతి తక్కువ ప్రమాదాలు నమోదు కావడం అభినందనీయమని తెలిపారు. సేఫ్టీ జీఎం మాట్లాడుతూ.. కార్మికులకు రక్షణపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు. అనంతరం కళాకారులు రక్షణ ప్రాముఖ్యతను తెలిపే నాటికలు ప్రదర్శించారు. తనిఖీ బృందం కన్వీనర్ డీ లలిత్‌కుమార్, ఏరియా రక్షణాధికారి శ్రీధర్, ఏజెంట్ రాముడు, గని మేనేజర్ సాయిప్రసాద్, గ్రూప్ ఇంజినీర్ రాజారవిచరణ్, రక్షణాధికారి రవిశంకర్, పిట్ ఇంజినీర్ ప్రవీణ్, వెంటిలేషన్ అధికారి జగదీశ్వరరావు, సంక్షేమాధికారి శంతన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.వందకు చేరిన ఉల్లి

- కొన్నా.. కోసినా కన్నీళ్లే..



రవీంద్రనగర్‌లో ఉల్లి విక్రయిస్తున్న వ్యాపారి

చింతలమానెపల్లి: మొన్నటివరకు సామాన్యులకు టమాట అందకుండా పోగా.. నేడు ఉల్లి కన్నీళ్లు తెప్పిస్తోంది. స్థానిక రవీంద్రనగర్ మార్కెట్‌లో కిలో ఉల్లి ధర రూ.వంద ఉండగా వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. వారం క్రితం వరకు రూ.30 ఉన్న ధర అమాంతం పెరిగింది. ఎరుపు ఉల్లి రూ.80, తెల్ల ఉల్లి రూ.100కు విక్రయిస్తున్నట్లు చిరువ్యాపారులు తెలిపారు. స్థానికంగా ఉల్లిగడ్డ లభించకపోవడంతో పాటు టోకు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరకు విక్రయిస్తుండటంతోనే ఉల్లికి ధర పెరిగినట్లు పేర్కొన్నారు.

వైద్యం వికటించి వివాహిత మృతి

- తల్లి ప్రేమకు దూరమైన ఇద్దరు చిన్నారులు



పుష్పలత(ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త, కుటుంబ సభ్యులు

చింతలమానెపల్లి(సిర్పూర్): ఓ ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించి వివాహిత ప్రాణాలు కోల్పోయింది. దీంతో ఆమె ఇద్దరు చిన్నారులు పసి వయస్సులోనే తల్లి ప్రేమకు దూరమయ్యారు. కుమురం భీం జిల్లాలో చోటుచేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చింతలమానెపల్లి మండలం కోర్సిని గ్రామానికి చెందిన ధన్నూరి పుష్పలత(25) రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఈ క్రమంలోనే గురువారం గ్రామానికి వచ్చిన ఆర్‌ఎంపీ గుర్లె గణేశ్‌ను బాధిత మహిళ వైద్యం కోసం ఆశ్రయించింది. రక్త నమూనాలు సేకరించిన గణేశ్ రవీంద్రనగర్‌లో పరీక్ష చేయించి టైఫాయిడ్ వచ్చినట్లు తెలిపాడు. గురువారం మధ్యాహ్నం పుష్పలతకు సెలైన్ పెట్టి ఇంజక్షన్(మోనోసెఫ్) ఇచ్చాడు. కొన్ని నిమిషాల్లోనే పుష్పలత తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పరిస్థితిని గమనించిన ఆర్‌ఎంపీ అక్కడి నుంచి పరారయ్యాడు. రక్తంతో వాంతులు కావడంతోపాటు అపస్మారక స్థితికి చేరడంతో భర్త ప్రసాద్, కుటుంబసభ్యులు ఆమెను కౌటాలలోని ప్రైవేటు ఆస్పత్రికి అక్కడి నుంచి కాగజ్‌నగర్‌కు తరలించారు. అక్కడి ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యులు పరీక్షించి అప్పటికే పుష్పలత మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం కుటుంబసభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. ఆర్‌ఎంపీ వైద్యంతోనే పుష్పలత మృతి చెందినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకటేశ్ గ్రామంలో విచారణ చేపట్టారు. వైద్యానికి వినియోగించిన మందులను స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌ఎంపీ గణేశ్ పోలీసుల అదుపులో ఉన్నట్లుగా సమాచారం. పుష్పలత మృతదేహం వద్ద భర్తతోపాటు మూడు నెలల కుమార్తె అక్షిత, రెండేళ్ల కుమార్తె శివాని పరిస్థితిని చూసి గ్రామస్తులు కంటతడి పెట్టుకున్నారు.

సేవ్ నేచర్.. సేవ్ ఎర్త్ పేరిట సైకిల్ యాత్ర



చంద్ర బలి మౌర్య

సర్పూర్(జి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి పట్టణానికి చెందిన చంద్రబలి మౌర్య సేవ్‌నేచర్.. సేవ్‌ఎర్త్ పేరిట మహారాష్ట్ర వరకు సైకిల్ యాత్ర చేపట్టాడు. ఈ యాత్ర శుక్రవారం మండలానికి చేరుకుంది. 61వ నంబర్ జాతీయ రహదారిపై నందన్ ఎక్స్ రోడ్డు యాత్రీకుడిని 'సాక్షి' పలకరించింది. నవంబర్ 2021 నుంచి ఇప్పటివరకు 25 వేల కిలోమీటర్లు ప్రయాణం పూర్తి చేసినట్లు పేర్కొన్నాడు. దేశ వ్యాప్తంగా లక్ష కిలోమీటర్లు సైకిల్ యాత్ర పూర్తిచేసేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపాడు. ప్రస్తుత రోజుల్లో మానవులు ప్రకృతి, భూమిని కలుషితం చేస్తున్నారని వాటిని కాపాడుకోవాలని సైకిల్ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నాడు. దాతల సహాయంతో యాత్ర కొనసాగిస్తున్నట్లు వెల్లడించాడు.

తండ్రి కోసం.. తనయుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన తన తండ్రి జోగు రామన్నను గెలిపించాలని కోరుతూ ఆయన తనయుడైన మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పట్టణంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా తన తండ్రి చేసిన అభివృద్ధిని వివరిస్తూ గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



దహెగాంలో ప్రచారం చేస్తున్న కోనేరు వంశీ

దహెగాం: సిర్పూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బరిలో నిలిచిన సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తనయుడు కోనేరు వంశీ ప్రచారం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు వాడల్లో తిరుగుతూ కారు గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించాడు. అతడి వెంట మండల రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ సంతోష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, సర్పంచు పుప్పాల లక్ష్మి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బండ క్రిష్ణమూర్తి, మాజీ ఎంపీపీ వాణి పాల్గొన్నారు.